ప్రజాశక్తి

బుధవారం 8 ఫిబ్రవరి 2023 5 అనంతపురం

లేపాక్షి ఆలయం విశేషాలను తెలుసుకుంటున్న జి-20 ప్రతినిధులు

నెలకు రూ.30 వేలు లీజు ఇవ్వాలి

సదస్సులో ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

◆ సోలార్‌కిచ్చే భూ రైతులకు చట్టబద్ధమైన న్యాయం చేయాలి

◆ వారికి ఏడాదికి రూ.1.50 కోట్లు ఆదాయం.... ◆ రైతుకు ఏడాదికి రూ.30 వేలేనా..!

◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ◆ అదానీ సోలార్ ఎనర్జీ వరమా .? శాపమా .? సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా పరిధిలో గాలి, సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు కోసం రైతుల నుంచి తీసుకుంటున్న భూములకు నెలకు రూ.30వేలు లీజు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జిల్లాలో పెద్దఎత్తున ఏర్పాటవుతున్న 'అదానీ సోలార్ ఎనర్జీ వరమా.? శాపమా.?' అన్న అంశంపై అనంతపురం నగరంలోని ఎన్జీవో హోంలో సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నాడు సదస్సు జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంలో ఏడాదిలో 300 రోజుల వరకు ఎండ బాగా ఉండటమే కాకుండా ఎత్తైన ప్రాంతం కావడంతో విద్యుత్ ఉత్పత్తికి అనువైన ప్రాంతమని చెప్పారు. అందుకే ఈ ప్రాంతంలో పెద్దఎత్తున సౌర గాలి విద్యుత్ కేంద్రాల ఏర్పాటు జరుగుతోందన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల కోసమని సేకరిస్తున్న భూమి గతంలోలాగా కాకుండా లీజు పద్ధతిలో పెద్దపెద్ద కంపెనీలకు కట్టబెట్టడం జరుగుతోందన్నారు. ఏడాదికి రూ.30 వేలు మాత్రమే రైతులకు లీజు ఇస్తున్నారన్నారు. ఇది కేవలం ఒప్పందం ద్వారానే జరుగుతోందని చెప్పారు. ఏదైనా సమస్య వచ్చి లీజు చెల్లించకపోతే రైతు అడగటానికి వీల్లేకుండా ఉన్నందున చట్టబద్ధమైన రక్షణను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ఒక్క మెగావాట్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే ఐదు ఎకరాల విస్తీర్ణం అవసరమవుతుందని చెప్పారు. దీని ద్వారా 20 వేల నుంచి 25 వేల యూనిట్లు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దీని వల్ల కంపెనీకి నెలకు రూ.6,7 లక్షల ఆదాయం ఉంటుందని కంపెనీలు చూసే ఆడిటర్స్ చెబుతున్నారన్నారు. ఇలా ఏడాదికి రూ.1.50 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోందన్నారు. రైతుకు ఎకరానికి లీజు కింద ఏడాది మొత్తానికి ఇస్తున్నది కేవలం రూ.30 వేలు మాత్రమేనని చెప్పారు. ఇది సరైంది కాదని నెలకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయాల్సిన అవసరముందని తెలిపారు. యూనిట్‌కు రూ.1.99 అయితే సరిపోతుందని 'సెకీ' సంస్థ చెబుతోందని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు చేసుకున్న ఒప్పందాల ప్రకారం అదానీ సంస్థకు చెల్లిస్తున్నది రూ.2.49 అని వివరించారు. ఈ ధరకే చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు విద్యుత్‌నివ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ పరిశ్రమలకు రూ.7కుపైగా యూనిట్‌కు ఇస్తున్నారని పేర్కొన్నారు. దీనికితోడు ట్రూఆఫ్ పేరుతో అదనపు బాదుడు వేస్తుండటంతో చిన్న,మధ్య తరహా పరిశ్రమలు మూతపడుతున్నాయని చెప్పారు. వీటికి రూ.2.49తోనే విద్యుత్‌ను అందివ్వాలని డిమాండ్ చేశారు. కాలనుగుణంగా విద్యుత్ ధరలను ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ సమీక్షించి ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై రైతులు, ప్రజల్లోనూ అవగాహన కల్పించి పోరాటాలకు సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం సీనియర్ నాయకులు జి.ఓబుళు మాట్లాడుతూ జిల్లాలో పెద్దఎత్తున పవన, గాలి విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు జరుగుతోందన్నారు. రైతులకు ఇప్పుడు ఇస్తున్న లీజు ఏ మాత్రం సరిపోదని, దీన్ని పెంచే విధంగా ఒత్తిడి పెంచాల్సిన అవసరముందన్నారు. జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో 3.16 లక్షల ఎకరాల భూములను సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం కేటాయించారన్నారు. ఇంత పెద్దఎత్తున భూములను అదానీ వంటి కంపెనీలకు ప్రభుత్వాలు కట్టబెడుతున్నాయన్నారు. తద్వారా ఉపాధి కోల్పోతున్న వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో గ్రామాలకు గ్రామాలే సోలార్ పరిశ్రమల కిందపోతున్నాయన్నారు. అయితే ఆ ప్లాంట్లలో లభిస్తున్న ఉపాధి ఏమీ ఉండటం లేదని చెప్పారు. ప్రభుత్వాలు దీనిపై స్పందించి రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, ఒ.నల్లప్ప, బి.శ్రీనివాసులు, సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో జి-20 ప్రతినిధులు

శిల్పకళా వైభవం అద్భుతమని కితాబు

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షిలో జి-20 విదేశీ ప్రతినిధులు సందర్శించారు. మంగళవారం సాయంత్రం కర్నాటక రాష్ట్రం పావగడ నుంచి లేపాక్షి ఆలయ సందర్శనకు విచ్చేశారు. ముందుగా లేపాక్షి ఆలయం వద్దకు చేరుకున్న 29 మంది జి-20 విదేశీ ప్రతినిధులకు కలెక్టర్ పి.బసంత్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అమరావతి సర్కిల్ ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ఆర్కియాలజిస్టులు సూర్యప్రకాష్, కమలహాసన్‌లు లేపాక్షి ఆలయ ప్రాశస్త్యం, చరిత్ర, దేవాలయ నిర్మాణం, కట్టడాలు, సభా మండపం, విజయనగర సామ్రాజ్యంలో ఆలయానికి ఉన్న ప్రాధాన్యత, శిల్ప సంపద, సీతమ్మ పాదం, భోజనశాల, వేలాడే స్తంభం, 680 స్తంభాలు తదితర వివరాలను తెలియజేశారు. వీటి గురించి తెలుసుకున్న విదేశీ ప్రతినిధులు ఆలయం అద్భుతం అని కొనియాడారు. ముఖ్యంగా వేలాడే స్తంభాన్ని చూసి వారు ఆశ్చర్యపోయారు. ఏకశిలా గణేషుడు, నాగలింగం విశిష్టత, శిల్పకళా సంపద, చరిత్ర గురించి తెలుసుకున్నారు. లేపాక్షి ఆలయం సందర్శన సందర్భంగా తిలకించిన దశ్యాలను వారి సెల్‌ఫోన్‌లలో బంధించారు. అనంతరం లేపాక్షి ఆలయం నుంచి బయలుదేరి వెళ్లి అతి పెద్ద ఏకశిలా నంది విగ్రహాన్ని తిలకించారు. లేపాక్షి పర్యటన సందర్భంగా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అమరావతి సర్కిల్ ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ డా॥గోపీనాథ్ జన, డివైఎస్‌ఏఈ కె.వీరాంజనేయులు, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు డివి.బోయి, పి.శ్రీనివాసరావు, ఏ.భానుప్రకాష్ వర్మ, అనంతపురం సర్కిల్ ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా కన్జర్వేషన్ అసిస్టెంట్ పి.బాలకష్ణారెడ్డి, ఏఎస్పీ రామకష్ణ ప్రసాద్, డీఎస్పీలు భవ్యకిషోర్, టిడి.యశ్వంత్, పాల్గొన్నారు.

పేదలతో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ఆర్‌హెచ్‌,ఈసీలకు అ'ధనం'..!

◆ చలానా కన్నా.. కమీషన్ అధికం

◆ చిలమత్తూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వసుళ్ల దందా

◆ 5 గంటల తరువాతనే అన్ని పనులూ..

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతి దందా జరుగుతోంది. ప్రతి పనికీ ఇంతా.. అంతా అంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున దండుకుంటున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. కార్యాలయానికి సంబంధించి రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్నారు. ఈయన స్థానంలో కొత్తగా సీనియర్ అసిస్టెంట్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు కార్యాలయంపై పట్టులేక పోవడంతో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసే ఓ ప్రయివేటు వ్యక్తి అన్నీతానై చక్రం తిప్పుతూ ప్రజల వద్ద వేలాది రూపాయలు దండుకుంటున్నట్లు తెలుస్తోంది. కార్యాలయంలో ఏ పని జరగాలన్నా ప్రతి పనికీ డబ్బులు అడుగుతూ సదరు కంప్యూటర్ ఆపరేటర్ దందాకు పాల్పడుతున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పథకం కింద జరుగుతున్న భూ రీ సర్వే నేపథ్యంలో ఆర్‌హెచ్, ఈసీ నకళ్లకు డిమాండ్ పెరిగింది. దీనిని ఇచ్చేందుకు ప్రభుత్వంకు చెల్లించే చలానా కన్నా, కమిషన్ రూపంలో ఇచ్చుకునేది అధికంగా ఉంటోందని ప్రజలు వాపోతున్నారు.

శాశ్వత భూ హక్కు... భూ రక్షతో డిమాండ్..

మండలంలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పథకంలో భాగంగా భూమి రీ సర్వే జరుగుతున్న నేపథ్యంలో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో భూమి ఆ రైతుకు ఎలా వచ్చింది అన్న ప్రశ్నకు సమాధానం కావాలంటే సర్వే నెంబర్ చరిత్ర అవసరం అవుతోంది. దీంతో భూ ప్రాథమిక రికార్డులుగా ఉన్న డైక్లాట్ మొదలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లభ్యమయ్యే ఆర్‌హెచ్, ఈసీలకు ప్రాధాన్యతతో పాటు వాటి నకళ్లకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలోనే దానిని అదనుగా చేసుకుని అమాయక భూ యాజమానులు రైతులు నుంచి పెద్ద మొత్తంలో వసుళ్లకు పాల్పడుతుండటం గమనార్హం.

5గం॥ తరువాతే ఈసి, ఆర్‌హెచ్

సబ్ రిజిస్టర్ కార్యాలయంలో లభ్యమయ్యే ఆర్‌హెచ్ కాపీలు నుంచి ఈసీలు నకలు వరుకు ఏది కావాలన్నా దరఖాస్తు పెట్టుకున్న వారి వద్ద చలనా పేరుతో డబ్బులు కట్టించుకోవడం దానికి రసీదు ఇవ్వక పోవడం సర్వసాధారణం అయ్యింది. దీనికి తోడు సాధారణంగా ఆర్‌హెచ్ కాపీకి రూ.400 చలానా అయితే సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సాయంత్రం ఐదు గంటల తర్వాత ఆ నకళ్లు కావాల్సిన వారిని రమ్మనడం అదనంగా రూ.600 వసూలు చేసి, తరువాత వాటి పత్రాలు ఇవ్వడం పరిపాటిగా మారింది. గత కొన్ని రోజులుగా నిత్యం ఇదే తంతు జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఈసీకి మాన్యువల్‌కు ఓ రేటు, కంప్యూటర్ ఈసీకి ఓ రేటు ఉంటుంది. ఇక్కడ ఏది కోరినా అదనంగా రూ. 600 చెల్లించకమాత్రం తప్పడం లేదు. అవసరాన్ని బట్టి ఈ మొత్తాన్ని మరింత పెంచేస్తున్నారు. ఇక రోజు వారి కార్యాలయంలో పని చేసే మధ్యవర్తులు రియల్టర్‌లు ఆర్‌హెచ్, ఈసీకి అదనంగా రూ.200 చెల్లిస్తున్నట్లు తెలుస్తుంది. ముందే డబ్బులిస్తే క్షణాల్లో పని అయిపోతోంది. డబ్బులు ఇవ్వని పక్షంలో సర్వర్ పనిచేయడం లేదంటూ తిప్పుకుంటున్నారు. చేసేది లేక చాలా మంది డబ్బులు అదనంగా సమర్పించి వారికి కావాల్సిన ఈసీ పత్రాలను తీసుకుని వెళ్తున్నారు. ఇటీవల చిలమత్తూరు సబ్‌రిస్టర్ కార్యాలయం వద్దకు 5 గంటల తరువాత వెళ్తే ఇలాంటి పరిస్థితి నిత్యం కన్పిస్తూనే ఉంది. ప్రయివేటు కంప్యూటర్ ఆపరేటర్‌లు, సిబ్బందిలో కొందరు అవినీతికి పాల్పడుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ అవినీతి దందాపై నిఘా ఉంచాల్సిన ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం అక్రమార్కులకు అదనపు బలంగా మారుతోంది.

చిలమత్తూరు సబ్‌రిజిస్టర్ కార్యాలయం

చర్యలు తీసుకుంటాం

ఇన్‌ఛార్జి సబ్ రిజిస్టార్ పారిజాత

సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వసుళ్ల పర్వంపై ప్రజాశక్తి ఇన్‌ఛార్జి సబ్ రిజిస్టార్ పారిజాతను ప్రజాశక్తి వివరణ కోరింది. దీనిపై స్పందించిన అధికారి అక్కడి సిబ్బందితో వెంటనే మాట్లాడారు. ఈసీ నకళ్లకు సంబంధించి బిల్లులు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. బిల్లు పుస్తకాలు అయిపోవడంతో తెల్లకాగితంపై రాసి ఇస్తున్నామంటూ సిబ్బంది సమాధానం ఇచ్చారు. అనంతరం సబ్‌రిస్టార్ ప్రజాశక్తితో మాట్లాడారు. భూ రీ సర్వే నేపథ్యంలో ఈసీ, ఆర్‌హెచ్ కాపీలకు ధరఖాస్తులు అధికంగా వస్తున్న మాట వాస్తవం అన్నారు. దీనికి సంబంధించి బిల్లులు ఇవ్వడం లేదన్నది తనకు తెలియదని, ఇకపై అలా జరగకుండా అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన అధిక మొత్తంలో డబ్బులు వసుళ్లు చేస్తే తనకు ఫిర్యాదు చేయాలన్నారు. అధికంగా డబ్బులు వసూళ్లు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేదల గోడు ప్రభుత్వానికి పట్టదా.?

◆ సెంటు స్థలం కూడా ఇవ్వకపోవడం దుర్మార్గం

◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఏళ్ల తరబడి సొంత ఇళ్లు లేక, అద్దెలు కట్టలేక నిరుపేదలు ఆర్థికంగా చితికిపోతున్నా ప్రభుత్వాలకు వీరిగోడు పట్టడం లేదంటూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. అనంతపురం రూరల్ మండలం రాజీవ్‌కాలనీ ప్రభుత్వ భూమిలో ఇటీవల పేదలు వేసుకున్న గుడిసెలను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ప్రభుత్వమని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 40 రోజులుగా పేదలు గుడిసెలు వేసుకుని ఇబ్బందులు పడుతుంటే సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు చోద్యం చూడటం సరికాదన్నారు. జిల్లాలో గుడిసెలు ఏర్పాటు చేసుకున్న పేదలు, స్థలం కావాలని అనేక రూపాల్లో ప్రభుత్వానికి తెలియజేశారన్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. అర్జీలు, ఆధార్ కార్డులు, తదితర పత్రాలతో సహా అధికారులకు అందజేసిన పట్టించుకునే తీరిక లేదా అంటూ ధ్వజమెత్తారు. మహిళలు, చంటి పిల్లలతో స్థలాల వద్ద కాచుకునే పరిస్థితి నెలకొందన్నారు. పేదలు రెండు సెంట్ల స్థలం ఇవ్వమంటే ఇవ్వని అధికారులు కబ్జాదారులకు మాత్రం వందల ఎకరాలు దోచుకునే వెసులుబాటును కల్పిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ భూములని పూర్తిగా విచారించుకున్నాకే పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. అది ప్రభుత్వానిదా, ప్రయివేటు భూమో తేల్చాల్సిన రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గంగా ఉందన్నారు. జగనన్న కాలనీలు గ్రామాలు, పట్టణాలకు దూరంగా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అవి కూడా పూర్తి చేయని పరిస్థితి నెలకొందన్నారు. పట్టణానికి సమీపంలోనే ప్రభుత్వ భూముల్లో పేదలు నివసిస్తుంటే పట్టాలు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. తక్షణమే జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర స్థాయిలో పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు ప్రకాష్, వలీ, మసూద్, బాబు, వెంకట నారాయణ, డేవిడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిన గుండె

- పింఛన్ కోసం పోరాడుతూ తనువు చాలించిన ఒంటరి మహిళ

పాలమ్మ (పాతచిత్రం)

రాయదుర్గం : పింఛన్ నిలిపివేయడంతో పునరుద్ధరణకు అధికారుల చుట్టూ తిరిగి తిరిగీ ఫలితం లేకపోవడంతో ఓ మహిళ గుండె ఆగింది. పట్టణంలోని గ్యాస్ గోడౌన్ ప్రాంతానికి చెందిన పాలమ్మ ఒంటరి మహిళ. భర్త చనిపోయి కొంతకాలమైంది. సంతానం లేదు. దీంతో గతంలో ఆమెకు వితంతు పింఛన్ వచ్చేది. అయితే ఏడు నెలల క్రితం ఆమెకు పింఛన్ రాకుండా ఆగిపోయింది. ఈనేపథ్యంలో తనకు పింఛన్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతోంది. అనంతపురం కూడా వెళ్లి వచ్చిందని ఆమె మరిది శ్రీనివాసులు వాపోయాడు. అయినా ఫలితం లేకపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురై సోమవారం ఉదయం స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి అంబులెన్సులో తరలించేందుకు

పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రైతులు పండించిన పప్పుశనగ పంటను కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని గణేనాయక్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రబీలో పప్పుశనగ 63 పంట వేల హెక్టార్‌లో సాగు చేశారని తెలిపారు. రైతులు అప్పులు చేసి పంట సాగు చేశారని, దిగుబడి కూడా ఆశాజనకంగానే వచ్చిందన్నారు. మాండూస్ తుఫాను వల్ల ఎకరాకు రెండు మూడు క్వింటాల్ దిగుబడి తగ్గిందన్నారు. అయినా గతేడాది కంటే దిగుబడి బాగానే వచ్చిందన్నారు. గత 15 రోజుల నుంచి పప్పుశనగ కోతలు ప్రారంభం అయ్యాయని తెలిపారు. దాదాపు 5 నుంచి 8 బస్తాల దిగుబడి వస్తోందన్నారు. కానీ ప్రభుత్వం పంట కొనుగోలుపై రైతులకు ఏ విధమైన హామీ ఇవ్వకపోవడం వల్ల దళారీలు సిండికేట్‌గా ఏర్పడి రైతుల అవసరాలను అసరాగా చేసుకుంటున్నారని తెలిపారు. రూ.4500తో కొనుగోలు చేస్తున్నారని, వీటిలో తరుగు అంటూ క్వింటాకు 5 కిలోల చొప్పున తీసుకుని సంచి తూకం కిలో తీసుకుంటున్నారని తెలిపారు. ఈ విధంగా రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. కావున ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.5335కు అధనంగా పెరిగిన పెట్టుబడుల దృష్ట్యా క్వింటాల్‌కు రూ.600 బోనస్ ఇచ్చి కనీషం రూ.6 వేలు ప్రకారం రైతులు పండించిన మొత్తం పంట షరతులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. జొన్నలు, ధనియాలు, ఉలవలు కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు దృష్టి సారించి అధికారులపై ఒత్తిడి చేసి పప్పుశనగ కొనుగోలు చేసే విధంగా చూడాలన్నారు. లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

జెఈఈ మెయిన్స్‌లో

పారిశుధ్య కార్మికురాలి కుమార్తె ప్రతిభ

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగరపాలక సంస్థ 1వ సర్కిల్ పారిశుధ్య విభాగంలో అవుట్‌సోర్సింగ్ కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న ఎం.వరలక్ష్మి కుమార్తె ఎం.నవ్యశ్రీ మంగళవారం విడుదల అయిన జెఈఈ మెయిన్స్ పేపర్-1లో అత్యుత్తమ ప్రతిభ చాటింది. 80 శాతం మార్కులు సాధించి సత్తా చాటింది. విద్యార్థి తల్లి వరలక్ష్మి పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తూ తన కుమార్తెను కష్టపడి చదివించింది. అమ్మ కష్టాన్ని వృథా చేయకుండా నవ్యశ్రీ జెఈఈలో అత్యుత్తమ ప్రతిభ చాటింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుధ్య కార్మికుల పిల్లలకు విద్యా, వైద్య రంగాల్లో ప్రభుత్వ పథకాలను అమలు చేస్తే కార్మికుల పిల్లలు ఇంకా ఉన్నతమైన చదువులు చదివి సత్తా చాటే అవకాశం ఉందని కార్మికురాలు వరలక్ష్మి పేర్కొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యం

ఉరవకొండ : ప్రజల వద్దకే వెళ్లి మెరుగైన వైద్యాన్ని అందించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని చేపట్టిందని కొట్టాలపల్లి ప్రభుత్వ వైద్యాధికారులు హరినాథ్‌రెడ్డి, చైతన్య లక్ష్మి తెలిపారు. మంగళవారం విడపనకల్ మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో కొట్టాలపల్లి పిహెచ్‌సి వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగశంకర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, అనుసూయ, 104 సిబ్బంది విజయ్, పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సత్యసాయి యూనియన్ ఉపాధ్యక్షులు బాలకృష్ణ

ఆందోళన చేస్తున్న కార్మికులు

ఉరవకొండ : పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని సత్యసాయి ప్రాజెక్టు యూనియన్ ఉపాధ్యక్షులు బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పెద్దకౌకుంట్ల గ్రామంలో సత్యసాయి యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు 7వరోజుకు చేరాయి. ఇందులో భాగంగా మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంప్‌హౌస్‌ల వద్ద కార్మికుల నిరసనలు నిర్వహించినట్లు తెలిపారు. నాలుగు నెలల నుంచి కార్మికులకు ఇవ్వాల్సిన జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం బాధాకరమన్నారు. ముఖ్యంగా కార్మికులకు కనీస వేతనం రూ.26వేల వేతనం ఇవ్వాలని, కార్మికులకు రావాల్సిన గ్రాటివిటీ ఫండ్‌తో పాటు పిఎఫ్, ఇఎస్‌ఐ గుర్తింపు కార్డులు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో కలిసొచ్చే కార్మిక ప్రజాసంఘాల సహకారంతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి యూనియన్ ప్రాజెక్టు నాయకులు మల్లికార్జున, శ్రీనివాసులు, రంజిత్, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథస్వామి వసంతోత్సవం

ప్రజాశక్తి-గుత్తి

రంగనాథస్వామి

మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు మంగళవారం స్వామికి హంసవాహనం, వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ చేసి గ్రామం పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం ఆలయ ఆవరణలో రంగనాథ స్వామికి ఊంజల సేవ చేశారు. అనంతరం సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలను జక్కలచెరువు గ్రామానికి తీసుకెళ్లగా అక్కడ భక్తులు స్వామిని వైభవంగా స్వాగతం పలికారు. స్వామి ఉత్సవ విగ్రహాలు జక్కలచెరువు గ్రామానికి తరలివెళ్లడంతో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వి. దేవదాసు తెలిపారు. కాగా దేవస్థానంలో ఉన్న హుండీను లెక్కించగా రూ.7, 81,089 ఆదాయం వచ్చినట్లు ఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రవికుమార్, సిబ్బంది రామకష్ట, బాలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'సుందర అనంత'కు అధిక ప్రాధాన్యత
మేయర్ మహమ్మద్ వసీం

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురాన్ని సుందర అనంత నగరంగా తీర్చిదిద్దేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. నగరం లోని సైఫుల్లా బ్రిడ్జిపై రూ.2.50 లక్షలతో వేయించిన పెయింటింగ్ పనులను మేయర్ మహమ్మద్ వసీం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ఖ్యాతిని పెంచేందుకు కళాత్మకంగా వేస్తున్న వాల్ పెయింటింగ్ ఎంతో దోహదపడుతుందన్నారు. నగర శోభను మరింత పెంచేందుకు నగరంలో రూ.38 లక్షలతో వాల్ పెయింటింగ్ వేయిస్తున్నట్లు తెలిపారు. అలాగే నగరంలోని విద్యుత్ నగర్ సర్కిల్ నుండి నవోదయ కాలనీ వరకు రూ. 20లక్షలు, ఆర్టీవో ఆఫీస్ రోడ్డు, జెఎన్‌టియు రోడ్డు రూ.10లక్షలు, ఓల్డ్‌టౌన్‌లో రూ.5లక్షలు, సైఫుల్లా బ్రిడి పై రూ.2.50 లక్షలు, డిఇఒ కార్యాలయం వద్ద రూ.50 వేలు వెచ్చించి వాల్ పెయింటింగ్ పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు నగరంలో ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్ట్ అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శేఖర్‌బాబు, అనిల్‌కుమార్‌రెడ్డి, ఇషాక్‌తోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెయింటింగ్స్‌ను పరిశీలిస్తున్న మేయర్ వసీం

పంట నమోదు ప్రక్రియ పూర్తి చేయండి
వ్యవసాయ కమిషనర్ హరికిరణ్

ప్రజాశక్తి-అనంతపురం

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

పంటల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ హరికిరణ్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఆదేశించారు. ఈమేరకు మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంట నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పిఎం కిసాన్, పంట నమోదు చేసుకున్న రైతులకు ఇకెవైసిని పూర్తి చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల అమ్మకం పెరగాలని, వ్యవసాయ శాఖ ద్వారా అమలయ్యే పథకాలు పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్, డివిజినల్ సహాయ వ్యవసాయ సంచాలకులు పద్మజ, వెంకటరాముడు, లక్ష్మనాయక్, సాంకేతిక వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఘనంగా ఆశాడే

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆశాడే కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

మండల కేంద్రంలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడేను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు మాట్లాడుతూ గర్భిణులు, చిన్నపిల్లల్లో అనేమియాను నివారించడానికి అదనపు ఆహారం తీసుకోవాలన్నారు. అలాగే గర్భిణులకు కిల్కారి యాప్‌పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. పిల్లల్లో విటమిన్-ఎ లోపం నివారణకు విటమిన్-ఎ ద్రావకం ఆరు నెలలకు మొదలు పెట్టి ఐదేళ్ల వరకూ 9 డోసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. విటమిన్-ఎ కల్గిన ఆహార పదార్థాలు బొప్పాయి, క్యారెట్, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దయాకర్, సబిహాసుల్తానా, సిహెచ్ఒ చంద్రావతి, ఎంపిహెచ్ఇఒలు నాగేశ్వరయ్య, మునాఫ్, పిహెచ్ ఎన్.తులసమ్మ, సూపర్‌వైజర్ వెంకటరత్నమ్మ, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

పేదలకు అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు వ్యవస్థాపకురాలు నిర్మలమురళి

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 5వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని పెద్దాసుపత్రి వద్ద ట్రస్టు నిర్వాహకులు పురుషోత్తమ మురళీకృష్ణ, నిర్మలమురళీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు మాట్లాడుతూ దాతల సహకారంతో నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఐదేళ్లుగా విజయవంతంగా ముందుకు సాగుతున్నట్లు తెలిఆపరు. దేవుడు తమకి ఇచ్చిన కొంతలో పేదలు, దివ్యాంగులు, వివాహాలకు ఆర్థికసాయంతోపాటు, నిత్యవసరాలు, అన్నదానం, రక్తదానం చేశామన్నారు. సేవాకార్యక్రమాలతోపాటు 2022 జూన్ 19న నిస్సహాయ నిరాదరణ మహిళల కోసం 'పుట్టినిల్లు' ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆదరణ కోల్పోయిన మహిళలకు పుట్టినిల్లులా ఆశ్రమం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శ్రీమతి శ్రీదేవి, ట్రస్టు సభ్యులు మల్లీశ్వరి, అంజలి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ సోషల్ సర్వీస్ సభ్యుల ఔదార్యం

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఫ్రెండ్స్ సోషల్ సర్వీస్ సంస్థ సభ్యులు

13 సంవత్సరాలుగా మంచానికి పరిమితమైన ఒక యువకుడికి సేవ చేస్తూ అమ్మతానానికి. మాతృత్వానికి స్ఫూర్తిగా నిలిచిన ఓ మహిళకు ఫ్రెండ్స్ సోషల్ సర్వీస్ సంస్థ చేయూతనందించింది. చిరు ఉద్యోగులుగా పలు సంస్థలో పనిచేస్తున్న సంస్థ సభ్యులు నగరంలోని 3వరోడ్డులో నివసిస్తున్న ఒంటరి మహిళ రాజేశ్వరికి నెలరోజుల సరుకులు అందజేశారు. 13 సంవత్సరాలుగా నరాల సమస్యతో మంచానికి పరిమితమైన బాలుడికి సేవ చేస్తూనే జీవనం గడుపుతున్న ఆమె ఉన్నతం గొప్పదని సభ్యులు ప్రసాద్ కొనియాడారు. ఆర్థిక స్థోమతుల కారణంగా మరి ఇతర కారణాల కారణంగా చెత్తకుప్పల్లో పసికందులను పడేస్తున్న తరుణంలో ఇలాంటి మహిళలు సమాజ స్ఫూర్తిని నింపడానికి ఆదర్శవంతులుగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, నరేష్, హబీబ్, ఈశ్వర్, మహేష్, అన్వర్, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ప్రాంగణంలో పరిశుభ్రత పాటించాలి
ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ సంఘాల ఆందోళన

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో తక్షణం పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం కళాశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. కళాశాలలోని చదువుల తల్లి విగ్రహం చుట్టూ అపరిశుభ్రత ఉన్నా చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట వారు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడుగడుగునా అపరిశుభ్రత తాండవిస్తోందనిన్నారు. కళాశాల తరగతి గదులలో,కళాశాల ముంగిట అపరశుభ్రత తాండవిస్తోందని తాము అనేకమార్లు ప్రిన్సిపాల్ దృష్టికి తెచ్చామన్నారు. ప్రిన్సిపాల్‌కు చీమకుట్టినట్లైనా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల చుట్టూ, మైదానం, ఆడిటోరియం చుట్టూ ఏపుగా ముళ్లపొదలు పెరిగాయన్నారు. అపరిశుభ్రంగా ఉన్నా అధ్యాపకులు, ఉపాధ్యాయులు చోద్యం చూస్తున్నారన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తే పోలీసులతో అక్రమ అరెస్టు చేయించేందుకు పూనుకోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కళాశాలలో మైదానాన్ని తక్షణం శుభ్రం చేయించి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు రేగాటి శివకృష్ణ, ఎఐఎస్ఎఫ్ తాలూకా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ప్రమోద్, అశోక్, శేషు, సింహాద్రినాయక్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో రాణించిన విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న నలంద కళాశాల సిబ్బంది

జెఇఇ మెయిన్స్-2023 మొదటి సెషన్స్ ఫలితాల్లో స్థానిక నలంద జూనియర్ కళాశాల విద్యార్థులు ఎం.ప్రజ్ఞశ్రీ జాతీయ స్థాయిలో జనరల్ క్యాటగిరిలో 97.56 శాతం, ఏ.విశ్వేశ్వరరెడ్డి 97.23 శాతం సాధించి కళాశాల టాపర్స్ నిలిచినట్లు ప్రిన్సిపాళ్లు ఖాజీబాబు, వినోద్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెఇఇ మెయిన్స్ మొదటి సెషన్స్ ఫలితాల్లో ఇద్దరు విద్యార్థులు జనరల్ కేటగిరిలో జాతీయ స్థాయి పర్సెంటేజ్‌తో రాణించగా మరో ఐదుగురు ఉత్తమ పర్సెంటేజ్ సాధించినట్లు తెలిపారు. ఇంతటి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల సిబ్బందిని నలంద విద్యాసంస్థలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రీజినల్ హెడ్ కేతినేని మాధవరావు ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు.

నారాయణ ప్రభంజనం

జెఇఇ మెయిన్ పరీక్ష ఫలితాల్లో అనంతపురం నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల డీన్ బద్రీనాథ్ తెలిపారు. కళాశాలకు చెందిన నిఖిల్ అగ్నిహోత్రి 99.63 శాతం, మదీహా ముస్కాన్ 98.66 శాతం, వెంకట భవదీప్, దివ్యశ్రీ 95.59, గణేష్ కుమార్‌రెడ్డి 95.43, పార్దీప్ 95.30, అరుణ్ సాయికుమార్ 94.69, రితిక 94.30, కీర్తన 94.29, అభిలాష్ 94.20 శాతం ఫలితాలను సాధించారు. అలాగే 21 మంది విద్యార్థులు 90 శాతం, 113 మంది విద్యార్థులు 80, 25 మంది 70, పర్సంటేజీ సాధించి ప్రభంజనం సృష్టించినట్లు తెలిపారు. ఈమేరకు విద్యార్థులను డిజిఎం వెంకట్రామిరెడ్డి, డీన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ రవిశంకర్‌రెడ్డి, ఓబన్నగౌడ్, శిఖామణి, శ్రీధర్‌బాబు, హిమబిందు, నిర్మల, తదితరులను అభినందించారు.

జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన నారాయణ కళాశాల విద్యార్థులు

ఎపి.రెడ్డి సంఘానికి సంపూర్ణ సహకారం
రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

సజ్జలను సన్మానిస్తున్న ఎపి రెడ్డి సంఘం నాయకులు

ఆంధ్రప్రదేశ్ రెడ్డిసంఘానికి ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు. ఈమేరకు మంగళవారం జిల్లా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి పలుసమస్యలను విన్నవించినట్లు తెలిపారు. ముఖ్యంగా జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ప్రారంభానికి రావాలని ఆహ్వానించారు. అలాగే రాష్ట్రంలోని శ్రీశైలం, ద్వారకా తిరుమల, సింహాచలం, పెన్నహోబిలం, కసాపురం, పుట్టపర్తి వంటి ప్రదేశాల్లో గృహాలు, కల్యాణ మంటపాలు నిర్మించడానికి స్థలం కేటాయించాలని కోరారు. ఆత్మకూరులో రెడ్డి సంఘం భవనం కోసం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్థలం కేటాయించారని, కూడేరు, తాడిపత్రి వంటి ప్రదేశాల్లో రెడ్డి కమ్యూనిటీ భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం నుంచి భూమి కేటాయించి భవన నిర్మాణాలకు సహకరించాలని కోరారు. ఇందుకు స్పందించిన సజ్జల ఆయా సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సజ్జలను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ రెడ్డిసంఘం రాష్ట్ర వ్యవస్థాపక కోఆర్డినేటర్ గంగలకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి బైపురెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్.రామకృష్ణారెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి సుశీలరెడ్డి, జిల్లా అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని బాలాపురం సచివాలయాన్ని ఎంపిడిఒ యోగానందరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మూమెంట్ రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వాలంటరీలు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా.. లేదా.. అని వివరాలు తెలుసుకోవడంతోపాటు కుటుంబ సభ్యుల వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌ల్లో అప్‌లోడ్ చేయాలన్నారు. అదేవిధంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటర్లు, తదితరులు పాల్గొన్నారు.

మటన్, చేపల
మార్కెట్ వేలంపాట

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మటన్, చేపల మార్కెట్‌కు నిర్వహించిన వేలంపాటలో కాంట్రాక్టర్ లోకనాథ్‌రెడ్డి రూ.5.65 లక్షలకు వేలం పాడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి రెవెన్యూ ఆఫీసర్లు సతీష్ సుజాత రెవెన్యూ ఇన్స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు
వచ్చిన వారికి ధన్యవాదాలు

ఉరవకొండ : తమ తండ్రి, దివంగత మాజీ ఎమ్మెల్యే ఎల్లారెడ్డిగారి భీమిరెడ్డి విగ్రహావిష్కరణకు తరలివచ్చిన మంత్రులు, కర్నూలు, అనంతపురం జిల్లాల ఎంపిలు, ఎమ్మెల్యేలు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. తన తండ్రి చేసిన ప్రజా సేవకు గుర్తుగా తాము ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణతోపాటు పార్కు ప్రారంభోత్సవానికి ప్రజలు తండోపతండాలుగా వచ్చారన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు అందరికీ రుణపడి ఉంటామన్నారు.

ఆవాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ముస్కిన్
జిల్లా నుంచి మరో ముగ్గురికి చోటు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆవాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కిన్ ఎన్నికయ్యారు. ఈనెల 5న గుంటూరులో నిర్వహించిన ఆవాజ్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ముస్కిన్‌తోపాటు మరో ముగ్గురికి చోటు కల్పించినట్లు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎ.సుభహాన్ తెలిపారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ముస్కిన్‌తో పాటు అనంతపురం జిల్లా నుంచి మరో ముగ్గురికి రాష్ట్ర కమిటీలో సభ్యులుగా చోటు దక్కిందన్నారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి, నాయకులు మసూద్, ఇర్ఫాన్‌లకు సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆవాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముస్కిన్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల సాధనకు తమవంతు కృషి అందిస్తానని తెలిపారు. ముస్లిం విద్యార్థులకు ఉపకార వేతనాలు యథావిధిగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ రాబోయే రోజుల్లో పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. తనను రాష్ట్ర కమిటిలో చోటు కల్పించిన నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

నాయీ బ్రాహ్మణులకు మొండిచేయి

ప్రజాశక్తి-శింగనమల

నాయీ బ్రాహ్మణులకు వైసిపి ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోందని ఎపి నాయీబ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారాయణ, నగర నాయీబ్రాహ్మణ టిడిపి అధ్యక్షుడు కడియాల కొండన్న, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, టిఎన్‌టియుసి పార్లమెంట్ కార్యనిర్వాహహక కార్యదర్శి లింగమయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నాయీ బ్రాహ్మణులకు ఏం సాయం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీనివాసులు తెలిసీ, తెలియక మాట్లాడడం మంచిది కాదన్నారు. నాయీ బ్రాహ్మణులకు న్యాయం చేస్తామని వైసిపిలోకి మల్లికార్జునను ఆహ్వానించి మూడున్నరేళ్లలో అభివృద్ధి చేయకపోవడంతో తిరిగి టిడిపిలోకి వచ్చారని గుర్తు చేశారు. టిడిపితోనే నాయీ బ్రాహ్మణులకు గుర్తింపు సాధ్యమన్నారు.

ఎపిఎస్‌డబ్ల్యుటిఎ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న డిఇఒ కృష్ణయ్య

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సావిత్రిబాయి పూలే మహిళా ఉపాధ్యాయ సంఘం రూపొందించిన నూతన సంవత్సర మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిఇఒ కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు దాసరి విజయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శోభ, మణి, సంఘం జిల్లా అధ్యక్షులు భవానీ, ప్రధాన కార్యదర్శి పావని, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఒంటరితనం భరించలేక వాలంటీర్ ఆత్మహత్య

ఉరేసుకున్న హర్షవర్ధన్‌రెడ్డి

గుత్తి : ఒంటరితనాన్ని భరించలేక గ్రామ వాలంటరీ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మాముడూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి (24) వాలంటీర్‌గా పనిచేస్తూ జీవన కొనసాగించేవాడు. యువకుడి తండ్రి శ్రీకాంత్‌రెడ్డితో పాటు తల్లి కూడా గతంలో మృతిచెందారు. దీంతో ఒంటరితనం భరించలేక మద్యానికి అలవాటు పడ్డాడు. ఈనేపథ్యంలో ఒంటరిగా ఉన్న అతడు మానసికంగా కుంగిపోయి ఇంటి పై కప్పనకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకుని యువకుడు..

ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన మధు

గుత్తి : పట్టణంలోని చెర్లోపల్లి కాలనీకి చెందిన వడ్డే మధు (32) మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మధు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. కుటుంబ సమస్యలతో మానసికంగా కుంగిపోయిన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రాయదుర్గంలో వ్యక్తి..

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని చదం గ్రామానికి చెందిన రాము (36) మంగళవారం తన ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. అనారోగ్యం కారణంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య శారదమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

మృతిచెందిన జుబేదాబీ

గుత్తి : పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న మారుతీనగర్‌లో సోమవారం రాత్రి ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. కారు డ్రైవర్‌గా పని చేసే ఖాజా భార్య జుబేదాబీ (27) ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే ఆమె మెడ మీద గాయాలు ఉండడంతో తల్లిదండ్రులు నబీసాబ్, హుస్సేన్‌బీ తమ కుమార్తెను భర్తే హత్య చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో నుంచి పడి యువకుడు..

మృతిచెందిన రవితేజ

గుత్తి : పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ సమీపంలో సోమవారం రాత్రి ఓ యువకుడు ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొజ్జేపల్లి గ్రామానికి చెందిన బి. రవితేజ (21) హైదరాబాదులోని ఓ ప్రయివేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. పని నిమిత్తం అనంతపురానికి వెళ్లి తిరిగి హైదరాబాదుకు వెళ్లేందుకు రైలు ఎక్కాడు. రైలులో డోర్ వద్ద నిల్చొని ఉండగా ప్రమాదవశాత్తు అతడు కిందపడి తీవ్రగాయాలతో మరణించాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వం తరలించారు. ఘటనపై జిఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పప్పుశనగ వామి దగ్ధం

అగ్నికి ఆహుతవుతున్న పప్పుశనగ కట్టె

పుట్లూరు : మండల పరిధిలోని మడ్డిపల్లి గ్రామంలో మంగళవారం పప్పుసెనగ కట్టె పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్తుల వివరాల మేరకు.. మడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎం.అంకాల్‌రెడ్డి, ఎం.వెంకట్రామిరెడ్డి తమ పొలంలో పండిన నాలుగు ట్రాక్టర్ల పప్పుసెనగ కట్టెను కల్లదొడ్డికి చేరుకుని వాముగా వేసుకున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి పప్పుసెనగ కట్టే పూర్తిగా కాలిబూడిదైంది. ఫలితంగా సుమారు 30 నుంచి 40 కింటాళ్ల పప్పుసెనగ బూడిదై రూ.1.50లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆర్థికసాయం అందించాలని రైతులు కోరారు.

బాస్కెట్‌బాల్ జాతీయ జట్టుకు అనంత విద్యార్థి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని వెంకటేశ్వర నగర్‌లో ఉన్న ప్రిన్స్ ఆఫ్ పీస్ పాఠశాలలో 9 తరగతి చదువుతున్న కనం సంజయ్‌రెడ్డి బాస్కెట్‌బాల్ (అండర్-14) విభాగంలో జాతీయ జట్టుకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ రమణారెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం స్థానిక పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి సంజయ్‌రెడ్డి ఈనెల 3 నుంచి 5 వరకు ఏలూరు జిల్లా నూజివీడులో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ అండర్-14 విభాగంలో జిల్లా తరుపున పాల్గొని మూడవ స్థానంలో నిలిపినట్లు తెలిపారు. దీంతో విద్యార్థిని జాతీయ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ అబ్బాయికి భవిష్యత్తులో అంతర్జాతీయ జట్టుకు ఎంపిక కావడానికి తమ సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రమణారెడ్డి, ఎఒ సుజాత, ప్రధానోపాధ్యాయులు రేణుక, సిబ్బంది రాఘవేంద్రరావు, కృష్ణమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, ఓబిలేసు, మహేష్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల అధ్యాపకులు